సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

గెడ్డల నిర్వహణ అధ్వానం

- జీవీఎంసీ 25, 43వ వార్డుల్లో పేరుకుపోయిన చెత్త
- పాలిథిన్ సంచులతో వ్యర్థాలు పడేస్తున్న స్థానికులు
- పూర్తి స్థాయిలో జరగని ఇంటింటా చెత్త సేకరణ
- గెడ్డల నిర్వహణ తీరుపై స్థానికుల ఆగ్రహం
- గెడ్డలో చెత్త వేయకుండా మెస్ ఏర్పాటుకు డిమాండ్


సీతంపేట మెయిన్‌రోడ్ గెడ్డలో పూడిక, పందుల విహారం


సీతంపేట మెయిన్ రోడ్‌లో శిథిలమైన గెడ్డ రక్షణ గోడ



నరేంద్ర నగర్‌లో గెడ్డ వద్ద ఏర్పాటు చేసిన బోర్డు


సీతంపేట అయ్యంగారి బేకరీ వద్ద గెడ్డలో చెత్త

సీతంపేట : కూటమి ప్రభుత్వం వచ్చాక పాలన అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం అధికారం చేపట్టి 9 నెలలు గడుస్తున్నా పాలన గాడిన పడలేదనే చెప్పాలి. వార్డుల్లో ప్రధానంగా పారిశుధ్యం అమలు తీరు అధ్వానంగా ఉంది. ఇంటింటా చెత్త సేకరణ, డ్రెయిన్లలో వ్యర్థాల తొలగింపు, గెడ్డల నిర్వహణ పూర్తి స్థాయిలో జరగడం లేదు. పారిశుధ్య నిర్వహణపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. జీవీఎంసీ 25, 43 వార్డుల్లో గెడ్డల నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఏ గెడ్డ చూసిన చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి రోత పుట్టిస్తున్నాయి.

నగరం మధ్యలో పందుల సంచారం

25వ వార్డు సీతంపేట మెయిన్‌రోడ్‌లో మార్గదర్శి బిల్డింగ్ పక్కన ఉన్న గెడ్డలో పూడిక తొలగించక పెద్ద ఎత్తున చెత్త, మురుగు పేరుకుపోయి అసహ్యకరమైన పరిస్థితి నెలకొంది. ఈ గెడ్డలో పందులు గుంపులుగా స్వైర విహారం చేస్తున్నాయి. నగరంలో పందుల సంచారంపై నిషేధం ఉన్నప్పటికీ నగరం మధ్యలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న గెడ్డల్లో పందులు గుంపులుగా సంచరిస్తున్నా నియంత్రించే నాథుడే కరువయ్యాడు. అలాగే సీతంపేట మెయిన్‌రోడ్‌లో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ బహుళ అంతస్థుల నిర్మాణానికి అనుకుని ఉన్న గెడ్డకు రక్షణగా ఉండాల్సిన రక్షణగోడ శిథిలమైపోయింది. గెడ్డలో చెత్త పేరుకుపోయింది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే సీతంపేట మెయిన్‌రోడ్‌కు అనుకుని ఉన్న గెడ్డకి రక్షణ గోడ శిథిలమై ప్రమాదకరంగా ఉన్నా కనీస చర్యలు చేపట్టడానికి ఎవరూ పట్టించుకోవడం లేదు. బీవీకే కళాశాల పక్కన గెడ్డలో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. అలాగే సీతంపేట మెయిన్‌రోడ్‌లో అయ్యంగారి బేకరీ పక్కన గల గెడ్డలో చెత్త పేరుకుపోయింది. గురుద్వారా సమీపంలో పాత పెట్రోల్ బంకు వద్ద గెడ్డలో చెత్త పేరుకుపోయి మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంతో చుట్టు పక్కల ఇళ్లల్లోకి, ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లోకి మురుగునీరు చేరడంతో నేల రోజులపాటు ఇబ్బందికి గురయ్యారు. దీంతో సమస్య పరిష్కారం కోసం రూ. 6.15 లక్షల వ్యయంతో ఇక్కడ బాక్సు కల్వర్టు నిర్మిస్తున్నారు. వారం రోజులుగా కల్వర్టు పనులు జరుగుతున్నాయి,

43వ వార్డులోనూ అదే దుస్థితి

జీవీఎంసీ 43వ వార్డులోని పలు ప్రాంతాల్లో గెడ్డల నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. 80 అడుగుల రోడ్ గౌరీ కల్యాణ మండపం వెనుక గల గెడ్డలో చెత్త పేరుకుపోయింది. అలాగే నరేంద్రనగర్ గెడ్డలో పెద్ద ఎత్తున చెత్త, పాలిథిన్ కవర్లతో వ్యర్థాలు పేరుకుపోయాయి. చాలా కాలంగా గెడ్డలోని పూడిక తొలగించలేదని, దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమల బెడద ఎక్కువైందని స్థానిక మహిళలు వాపోతున్నారు. గెడ్డల్లో మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది రాత్రి, పగలు తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయని నరేంద్రనగర్ గెడ్డకు ఆనుకుని నివసిస్తున్న నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


బీవీకే కళాశాల పక్కన గెడ్డలో పేరుకుపోయిన పూడిక

తూతూమంత్రంగా చెత్త సేకరణ

డ్రెయిన్లలో, గెడ్డల్లో పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలు చూస్తుంటే ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా అమలవుతుందా అనే సందేహం కలుగుతోంది. చెత్త సేకరణ కోసం ఆటో వెళ్లే మార్గాల్లో తప్ప, చిన్న చిన్న సందుల్లో, బహుళ అంతస్తుల భవనాల్లో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదని తెలుస్తోంది. దీంతో ఇంటిలోని చెత్త, వ్యర్థాలను పాలిథిన్ బ్యాగుల్లో వేసి డ్రెయిన్లలో పడేస్తున్నారు. అదంతా మురుగునీటి ప్రవాహంతో గెడ్డల్లోకి చేరుతున్నట్టు తెలుస్తోంది.

గెడ్డల్లో చెత్త తొలగించండి

సీతంపేట, మధురానగర్, శాంతిపురం, గురుద్వారా, బీవీకే కళాశాల ప్రాంతాల్లో గెడ్డకు ఆనుకుని వందలాది కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇంటింటా చెత్త సేకరణ పేరుతో చాలా చోట్ల డంపర్ బిన్లు తొలగించారు. ఇళ్లల్లోని వ్యర్థాలు పాలిథిన్ సంచుల్లో వేసి గెడ్డలో పడేస్తున్నారు. అలాగే ఎక్కడెక్కడో డ్రెయిన్లలో పడేసిన చెత్త గెడ్డల్లోకి కొట్టుకొస్తోంది. నెలల తరబడి గెడ్డల్లో పూడిక తీయడం లేదు. దుర్వాసనకు తోడు దోమలు పెరిగిపోవడంతో ఇళ్లల్లో ఉండలేకపోతున్నాం. గెడ్డల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి.

– రామలక్ష్మి, సీతంపేట.

గెడ్డలపై మెస్ ఏర్పాటు చేయాలి

43వ వార్డులో 80 అడుగుల రోడ్ గౌరీ కల్యాణ మండపం వెనుక ఉన్న గెడ్డలో, కర్రివాని గెడ్డలో చెత్త పేరుకుపోయింది. అలాగే నరేంద్ర నగర్ గెడ్డలో పెద్ద ఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. గెడ్డకు ఆనుకుని రెండు వైపులా నందగిరి నగర్ కాలనీ విస్తరించి ఉంది. గెడ్డలో చెత్త పేరుకుపోవడం వల్ల దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. గెడ్డలో చెత్త పడేయకుండా మెస్ ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఇటీవల జీవీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. గెడ్డల్లో చెత్త వేయకుండా మెస్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది

– సీహెచ్.ప్రసన్న, నరేంద్రనగర్

క్లుప్తంగా

నేడు "నడవండి.. నడిపించండి"

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ''నడవండి.. నడిపించండి'' కార్యక్రమం గురువారం నిర్వహిస్తామని వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.భానుప్రకాష్, సీహెచ్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో వాకర్స్ పాల్గొని సహకరించాలని కోరారు. నడక ద్వారా ఆరోగ్య రక్షణ సాధ్యమవుతుందని చాటి చెప్పేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యదర్శి చొల్లంగి ప్రసాదరావు సహకారంతో నడకలో పాల్గొనే వారందరికీ ఉడికించిన గుడ్డు, అరటి పండు అందిస్తామని తెలిపారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకు మాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాస్, ఆలయ కార్యనిర్వాహకురాలు రమాభాయి ముందుగా గణపతి పూజ, అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. భక్తుల గోత్ర నామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీరతో పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు ప్రతీ బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు బిందెలతో పసుపు నీళ్లు తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మద్రిపాలెం : జోన్ – 2లోని ఎస్ఎస్‌టీఎల్ సెక్షన్ పరిధిలో 11 కేవీ ఎయిర్‌పోర్టు ఫీడర్ నిర్వహణలో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంబేడ్కర్ కాలనీ, సాయినగర్, జాకీర్ హుస్సేన్‌నగర్, పార్వతి నగర్, కరాస, మాధవధార ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చిన్నారులకు టీకాలు వేయించాలి


చిన్నారికి టీకా వేస్తున్న ఏఎన్ఎం కృష్ణవేణి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులోని నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఏఎన్ఎం కృష్ణవేణి ఆధ్వర్యంలో పోలియో చుక్కలు, వ్యాధి నిరోధక టీకాలు వేశారు. అలాగే చిన్నారులకు వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. పుట్టినప్పటి నుంచి 16 సంవత్సరాల వయసు వరకు వ్యాధి నిరోధక టీకాలు చిన్నారులకు వేశామని ఏఎన్ఎం కృష్ణవేణి తెలిపారు. నెలకు ఆరు సార్లు బుధవారం, శనివారం టీకాలు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ భవానీ, ఆయా కోమలా రెడ్డి పాల్గొన్నారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.15.5 లక్షలు


హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది, స్వచ్ఛంద సేవకులు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని ఎర్నిమాంబ అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించారు. 37 రోజులకు గాను అమ్మవారి ముడుపులు, ప్రత్యేక దర్శనాలు, హుండీల ఆదాయం కలిపి రూ.15,50,308 నగదు, 58 గ్రాముల 100 మిల్లి గ్రాములు బంగారం, 8 కేజీల 051 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.ఎస్. సురేష్‌బాబా తెలిపారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కార్యాలయానికి చెందిన ఈవోలు కీర్తి శ్రీనివాసరావు, ఎం.నీలిమ పర్యవేక్షణలో దేవదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు ఈ లెక్కింపు నిర్వహించారు.కంచరపాలెం పోలీస్ కానిస్టేబుల్ రాంబాబు, అర్చకులు శ్రీకాంత్ శర్మ, పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ, సిబ్బంది ప్రసాద్, రామకృష్ణ, పాల్గొన్నారు.

చక్కని బోధనతో ఉత్తమ ఫలితాలు


శిక్షణ అందిస్తున్న సీడీపీవో రమణకుమారి

మద్రిపాలెం : మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ప్రాథమిక స్థాయిలో చక్కగా బోధించి బలమైన పునాది వేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని, ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారని అర్బన్ సీడీపీవో ఎంవీ రమణకుమారి సూచించారు. ఈ మేరకు బుధవారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, మహిళ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన జ్ఞాన జ్యోతి సమగ్ర శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతందన్నారు. విద్యతోపాటు ఆరోగ్య సంరక్షణ కూడా ఎంతో అవసరమని, అంగన్‌వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. అందుకు ఈ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఎంఈవో దివాకర్, రాఘవేంద్ర, తాబిత జ్యోతి, సాయికుమార్, దొరబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మనో వికాసం


పుస్తక సమీక్ష చేసిన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ మధుకుమార్

సీతంపేట : నేటి తరం విద్యార్థులు పుస్తకం చదవడం కన్నా, మొబైల్ ఫోన్ ద్వారా వారికి కావాల్సిన సమాచారాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నారని లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. బీకాం, బీబీఏ విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు చదవడం మాత్రమే కాకుండా, గ్రంథ సమీక్ష చేయడంలో కూడా శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులు వారికి సూచించిన గ్రంథాలను సమీక్షించి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన గ్రంథ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనం, సమీక్ష చేయడం మనో వికాసానికి దోహదపడతాయన్నారు. కళాశాల విద్యార్థులు త్రియానా, ఉషశ్రీ, ప్రణీత, ఇనయత్ ఆలీ, శ్రేయ, బి.తనూష, రమ్య, రాథోడ్, ఆమీర్ రౌత్రే గ్రంథ సమీక్ష చేశారు. ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, దీపక్ చౌదరి, సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు రియాజ్ మొహమ్మద్, రంగనాయకులు, బి.శ్రీనివాసరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

రైతుబజార్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు


రైతులతో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం రైతుబజారులో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. విజిలెన్స్ డిప్యూటీ డైరెక్టర్ పి.పాపారావు నేతృత్వంలో రైతుబజారులో దుకాణాలు పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. రైతులు పండించిన పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద ఎక్కువ పంట ఉన్నట్లయితే వారి పంటను రైతుబజారుకు తీసుకొచ్చి అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. రైతులు పండించే పంటలను మాత్రమే రైతుబజారులకు తీసుకురావాలని, దళారీల (హోల్‌సేల్) మార్కెట్ల నుంచి కొనుగోలు చేయరాదని ఆదేశాలు జారీ చేశారు. రైతుల కూరగాయలను నిత్యం పరిశీలించి నమోదు చేయాలని రైతుబజారు ఈవో జగదీశ్వరరావుకు విజిలెన్స్ అధికారులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కిరణ్, డీఎటీఎంవో ఎస్‌కే యాసిన్, ఏఎంసీ కార్యదర్శులు అరుణ, లక్ష్మీచైతన్య, వినియోగదారుల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్త జోన్‌లో కార్యకలాపాలు ప్రారంభించాలి

తాటిచెట్లపాలెం : దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో రైల్వే కార్మిక సంఘాలు తమ కార్యకలాపాలు ప్రారంభించాలని రైల్వే జాతీయ కార్మిక సంఘ నాయకుడు చలసాని గాంధీ పిలుపునిచ్చారు. భారతీయ రైల్వేలో గుర్తింపు సంఘాలుగా ఉన్న ఆలిండియా రైల్వే మెన్స్ ఫెడరేషన్ (ఎఐఆర్ఎఫ్), నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే (ఎన్ఎఫ్ఐఆర్)లు తాజాగా జరిగిన ఎన్నికల్లో గుర్తింపు సంఘాలుగా ఆయా జోన్లలో గుర్తింపు పొందాయి. ఆయా జోన్ల నుంచి కొత్త జోన్ ఏర్పడినందున ఈ కార్మిక సంఘాలకు సహజంగా గుర్తింపు వస్తుందని, కాబట్టి ఈ కార్మిక సంఘాల నాయకులు కొత్తగా ఏర్పడిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ కోసం కార్యకలాపాలు సిద్ధం చేయాలని తెలిపారు. వెంటనే ఈ కార్మిక సంఘాలు ఆస్తులు, అప్పుల పంపకాలు, ఉద్యోగుల బదిలీలు, కొత్త పోస్టులు వంటి అన్ని అంశాల్లో అప్రమత్తంగా ఉండి ఎవరికీ, ఏ డివిజన్ ప్రయోజనాలకూ భంగం కలగకుండా చూసుకోవాలని సూచించారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

బడ్డీల తొలగింపు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెం గ్రామస్తుల ఏడు అడుగుల అమ్మవారు ఆలయం ఎదుట బడ్డీల సమస్య పరిష్కారమైంది. అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు చొరవతో బుధవారం తొలిగించారు. బడ్డీలు కారణంగా అమ్మవారు కనిపించడం లేదని ఎమ్మెల్యేకు గ్రామ కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన వాటిని వెంటనే తొలిగించాలని ఆదేశించడంతో సిబ్బంది తొలగించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రాచీన సాహిత్యంలో ఆధునిక పోకడలు



మాట్లాడుతున్న ఆచార్య కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణమూర్తి

సీతంపేట : ప్రాచీన సాహిత్యమైనా, ఆధునిక సాహిత్యమైనా ప్రజాక్షేమం కోసం సాగితే ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆచార్య కొచ్చర్లకోట వెంకట సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి ఆధ్వర్యంలో స్థానిక ప్రిజమ్ కళాశాలలో 'ప్రాచీన సాహిత్యంలో ఆధునిక పోకడలు' అనే అంశంపై సాహిత్య ప్రసంగంలో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. ప్రపంచ సాహిత్యం మొదలుకుని, భారతీయ తెలుగు ప్రాచీన ఆధునిక సాహిత్యాలపై అవగాహన కల్పించారు. భాషలో సంభవిస్తున్న మార్పులు, అందుకు అనుగుణంగా సాహిత్యంలో వస్తున్న మార్పులు వివరించారు. కార్యక్రమంలో శేఖరమంత్రి ప్రభాకర్, చిన సూర్యనారాయణ, కుప్పిలి భీమేశ్వరరావు, వినయ భూషణరావు, జోగారావు, నిర్మలాదేవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మురళీనగర్ : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అధ్యక్షతన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధన అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకూడని, ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో యువతీ యువకులు ప్రేమ, వ్యామోహంలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సోషల్ మీడియా పరిచయాలు మానుకోవాలని, జీవితంలో స్థిరపడేందుకు మంచిగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలు ఆపద సమయంలో 112 నంబరుకు డయల్ చేయడం లేదా, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ పృథ్వీతేజ, కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, హెచ్ఎం బి.హేమలత, సీడీపీవో రామకుమారి, చింతాడ అచ్యుతరామారావు, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి జర్నలిస్టుల సమస్యలు


మాట్లాడుతున్న జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు

సీతంపేట : రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికలకు ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అండగా నిలుస్తుందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఏపీ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జర్నలిస్టులంతా తమ సమస్యలు, ఇబ్బందులను వివరించారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ అర్బన్ అధ్యక్షుడు పి.నారాయణ్ మాట్లాడుతూ చిన్న, మధ్య తరహా మాస పత్రికలకు ప్రభుత్వపరంగా న్యాయం చేసేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. ప్రధానంగా ఎంప్యానెల్‌తో సంబంధం లేకుండా అక్రిడేషన్లు, ప్రతి నియోజకవర్గానికి ఒక అక్రిడేషన్ మంజూరు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇళ్ల స్థలాల ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో తీర్మానించిన అంశాలను రాష్ట్ర కార్యవర్గం ద్వారా ఈ నెల 28న కూటమి నేతలకు, సమాచార మంత్రికి నివేదిస్తామని తెలిపారు. సమావేశంలో వివిధ జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

దళిత విద్యార్థిపై యువకుల దాష్టీకం దుర్మార్గం

కంచరపాలెం :

బుల్లెట్ బండి నడుపుతున్నందుకు దళిత విద్యార్థి చేతులు నరికేసిన దారుణ ఘటన తమిళనాడులో చోటు చేసుకోవడం ఎంతో దుర్మార్గమని దళితసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. కంచరపాలెం పరిధి ఊర్వశి కూడలి దళిత సేన కార్యాలయంలో బుధవారం దళిత విద్యార్థిపై యువకుల దాష్టీకంపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివగంగ జిల్లా మానామధురైకి చెందిన దళిత యువకుడిపై జరిగిన సంఘటనపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు పుచ్చ కామేశ్వరరావు, సిటీ కన్వీనర్ గొల్లమాల మీన, కార్యదర్శి పట్నాల ఝాన్సీ, ఉపాధ్యక్షుడు తాటిపూడి సీతారాం, నగర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మల్లికార్జునరావు, రాంజీ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న దళిత సేన నాయకులు

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం : గంజాయి అక్రమంగా తరలిస్తున్న నిందితులను విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్‌పీ ఎస్ఐ కేటీఆర్ లక్ష్మి, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హర్యానా రాష్ట్రం, హిస్సార్ జిల్లాకు చెందిన బబ్లు నప్రియ విశాఖపట్నం స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. 8 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

మరో కేసులో 12 కేజీల గంజాయి సీజ్

రైల్వేస్టేషన్‌లో మరో కేసులో జీఆర్పీ ఎస్ఐ ఎస్‌కే మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జేటీ నాయుడు కలిసి ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లాకు చెందిన ధనర్జయ పాంగిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 12 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com